## ఇద్దరు వీఆర్‌ఏలు సస్పెన్షన్

గోకవరం: అవకతవకలకు పాల్పడిన ఇద్దరు వీఆర్‌ఏలను సస్పెండ్ చేసినట్టు స్థానిక తహసీల్దార్ డి.సుగుణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. గుమ్మళ్లదొడ్డి వీఆర్‌ఏ కొల్లాటి సుబ్రహ్మణ్యప్రసాద్, మల్లవరం వీఆర్‌ఏ కుండెల్లి చిన్న తహసీల్దార్ కార్యాలయంలో వెబ్‌ల్యాండ్ ఆపరేటర్లుగా పని చేసేవారన్నారు. వెబ్‌ల్యాండ్‌లో రైతుల భూములకు డిజిటల్ సైన్ చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయడంతో పాటు మ్యూటేషన్ చేసిన సర్వే నంబర్లు గల భూములకు పట్టాదార్ పాస్ పుస్తకాలు జనరేట్ చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేశారన్నారు. డిజిటల్ సైన్ దుర్వినియోగం చేసి వెబ్‌ల్యాండ్‌లో మార్పులు, చేర్పులు చేశారన్నారు. దీనిపై రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ప్రాథమిక విచారణ నిర్వహించి వారిపై చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. విచారణ పెండింగ్‌లో ఉందని అప్పటి వరకు వీరిని సస్పెండ్ చేశామని వివరించారు.

## అన్నసమారాధన

అనపర్తి: స్థానిక సనాతన ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం రాజమహేంద్రవరం పుష్కరాలరేవులో అన్నసమారాధన నిర్వహించారు. సమితి గ్రూపు సభ్యుల ఆర్థిక సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి త్రినాథరెడ్డి ప్రారంభించారు.



# పేదలకు వరం జగనన్న సురక్ష

పెదపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు వరమని ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి తెలిపారు. కరకుదురులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సర్పంచి వుండ్రు చంద్రకళ అధ్యక్షతన నిర్వహించారు. శిబిరంలో సుమారు 750 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.విజయభాస్కర్, తహసీల్దార్ టి.సుభాష్, వైస్ ఎంపీపీ కరెడ్ల వెంకన్నబాబు, హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, వాసంశెట్టి మాధవ తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: పేద ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే ధ్యేయంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రవేశపెట్టారని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. మండలంలోని సుభద్రంపేట మండల ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో 586 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కూటి సాయితాతారావు, ఎంపీటీసీ ఎం.సత్తిబాబు, మండల ప్రత్యేకాధికారి సత్యరమేష్, పీహెచ్‌సీ డాక్టర్ జి.రామ్‌భాస్కర్ పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సర్పంచ్ వుండ్రు చంద్రకళ

బిక్కవోలు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజారోగ్యానికి ప్రభుత్వం ఇచ్చిన రక్ష అని ఏఎంసీ మాజీ ఛైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 527 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, ఉపసర్పంచ్ డాక్టర్ జంగా మురళీకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి కర్రి సత్యనారాయణరెడ్డి, డాక్టర్ రాజీవ్, డాక్టర్ దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.



బిక్కవోలు ఉన్నత పాఠశాలలో జగనన్న సురక్షలో వైద్య సేవలందిస్తున్న వైద్యులు

**సురక్ష శిబిరంలో 540 మంది వైద్య సేవలు**

మధురపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన కోరుకొండ సచివాలయంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. కోరుకొండ పీహెచ్‌సీ డాక్టర్లు రవిచంద్ర, గాయత్రి, జీఎస్ఎల్ వైద్య నిపుణులు శిబిరంలో సుమారు 540 మందికి వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా అంగన్ వాడీలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రోగాలు దూరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి లక్ష్మీ సరోజ, ఉప సర్పంచ్ నేతుల చిన్ని, వైఎస్సార్ సీపీ నాయకులు కేతినీడి అశోక్, బొరుసు బద్రి, పసుపులేటి బుల్లియ్యనాయుడు, వాకా నరసింహారావు, అయిల రామకృష్ణ, బొండాడ చందు, కోరుకొండ డిప్యూటీ తహసీల్దార్ నరేష్, ఐసీడీఎస్ పీఓ ఝాన్సీరాణి, సచివాలయం సెక్రటరీ రమేష్ బాబు పాల్గొన్నారు.



కోరుకొండలో అంగన్‌వాడీల పౌష్టికాహార ప్రదర్శనను ప్రారంభించిన అధికారులు

## ఏడేళ్ల బాలికపై అత్యాచారం

రాజానగరం: అభం, శుభం తెలియని వయసు ఆ బాలికది. మామయ్య అంటూ పిలిచే వ్యక్తి రమ్మనడంతో అమాయకంగా ఇంటిలోకి వెళ్లింది. అతను తనను ఏదో చేస్తున్నాడు, తెలుసుకునే పరిజ్ఞానంగాని, వయసుగాని లేని ఆ బాలిక, అతని చేష్టలను భరించలేకపోయింది. కేకలు వేసుకుంటూ బయటకు పరుగుతీసింది. ఇరుగు పొరుగు వచ్చి చూస్తే .. ఇంకేముంది. కామాంధుడి దాహానికి ఆ బాలిక నలిగిపోయింది. అయితే ఆ కామాంధుడి వయస్సు కూడా 17 సంవత్సరాలు దాటకపోవడమో, లేక తమ సామాజిక వర్గానికి చెందిన వాడేనని కులాభిమానం చూపారో ఏమోగాని, ఆ బాలిక ఆర్తనాదాలు పోలీసు స్టేషను వరకు రాకుండా చేశారు. ఆదివారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో రాజానగరం శివారు సూర్యారావుపేటలో జరిగిన ఈ దుర్ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానిక సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపిన వివరాలిలావున్నాయి.

కోరుకొండ మండలం మధురపూడికి చెందిన దంపతులు తమ ఏడేళ్ల కుమార్తెను తీసుకుని ఉపాధి కోసం సూర్యారావుపేట వచ్చి ఉంటున్నారు. తండ్రి తాపీ పనికి, తల్లి ఒక హోటల్‌లో రోజువారీ కూలికి పోవడంతో ఒంటిరిగా ఉంటున్న ఆ బాలికపై పక్కింట్లో ఉంటున్న 17 సంవత్సరాల బాలుడి కన్ను పడింది. ఆదివారం సాయంత్రం అతని చెల్లెలితో ఆడుకోవడానికి వచ్చిన ఆ బాలికను లోనికి రమ్మని పిలిచాడు. తాను మామయ్య అంటూ పిలిచే వ్యక్తి రమ్మనడంతో అమాయకంగా ఇంటిలోకి వెళ్లిన ఆ బాలికపై పడి తన కామదాహాన్ని తీర్చుకునే ప్రయత్నం చేశాడు. ఆ చేష్టలకు రక్తం కారుతుంటే కేకలు వేసుకుంటూ బయటకు పరుగు తీసింది. నిందితుని అదుపులోకి తీసుకుని, బాలికను వైద్య పరీక్షల నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించామని కేసు దర్యాప్తు చేస్తున్న సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు.

# వృద్ధురాలి దారుణ హత్య

- నిద్రిస్తుండగా ఘాతుకానికి పాల్పడిన దుండగులు
- కణుపూరులో కలకలం
- పోలీసుల ముమ్మర దర్యాప్తు

మధురపూడి: కోరుకొండ మండలం కణుపూరులో తల్లోజు పార్వతి (75) దారుణ హత్యకు గురైంది. తన ఇంట్లో మంగళవారం రాత్రి నిద్రించిన ఆమె బుధవారం ఉదయానికి రక్తపు మడుగులో పడి ఉంది. కోరుకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కణుపూరు మెయిన్ రోడ్డు బ్రహ్మలవీధిలో పార్వతి నివాసం ఉంటోంది. ఎప్పటిలాగే మంగళవారం రాత్రి తన మూడో కుమారుడు వెంకటేశ్వర్లు ఇంట్లో టీవీ సీరియల్ చూసింది. అనంతరం నాలుగో కుమారుడు వీరబాబు ఉంటున్న తన ఇంటికి వచ్చి నిద్రించింది. బుధవారం తెల్లవారేసరికి చనిపోయింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు హత్యచేసి ఉంటారని భావిస్తున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూజ్ బృందాలు వచ్చి ప్రాథమిక ఆధారాలను సేకరించాయి. రక్తపు మరకలు ఉన్న నైటీని ఆ ఇంటి లోపల షెడ్‌లో గుర్తించాయి.



పార్వతి మృతదేహం

**బలమైన కర్రతో కొట్టి..**

పోలీసు డాగ్ తొలుత ఇంటి నుంచి బయటకు వచ్చి మెయిన్ రోడ్డు మీదుగా సమీప ఇంటి వైపునకు పరుగులు తీసింది. తర్వాత మృతురాలి ఇంటి ఆవరణలోని షెడ్డులోకి వెళ్లింది. అనంతరం రోడ్డు మీదకు వచ్చింది. అలాగే క్లూజ్ టీమ్ ఘటనా స్థలంలో వేలిముద్రలు, మృతిరాలి తలపైనున్న మరకలను పరిశీలించింది. తలపై బలమైన కర్ర లేదా రాడ్డుతో కొట్టి చంపిఉంటారని అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు అనుమానితులను విచారణ చేస్తున్నారు. తల్లోజు పార్వతికి తొమ్మిది మంది సంతానం. వారిలో ఐదుగురు కూతుర్లు, నలుగురు కుమారులున్నారు. కుమార్తెలకు పెళ్లిళ్లు కావడంతో వేరే గ్రామాల్లో ఉంటున్నారు. కుమారుల్లో చిన్నవాడితో పాటు ఉమ్మడి ఇంట్లో పార్వతి నివసిస్తోంది. ఆమె భర్త సుబ్బారావు గతంలోనే మృతి చెందాడు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై కట్టా శారదా సతీష్



ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న పోలీసు డాగ్




## ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అభినందనలు



ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అభినందిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: హిమాచల్ ప్రదేశ్ ధర్మశాలలో ఇటీవల జరిగిన నేషనల్ అడ్వెంచర్ క్యాంప్‌లో ప్రతిభ కనబరిచిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అభినందించారు. యూనివర్సిటీ అనుబంధ కళాశాలలకు చెందిన పది మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు క్యాంప్ నుంచి బుధవారం ఇక్కడకు వచ్చి, వీసీ కలిశారు. వీరు రాప్లింగ్, ట్రెక్కింగ్‌లో చురుగ్గా పాల్గొని 65 కి.మీ. 10,500 అడుగుల ఎత్తులో ట్రెక్కింగ్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. వారిని రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ వై. శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

## ఘనంగా పునీత ఫ్రాన్సిస్ ఉత్సవం

మధురపూడి: పునీత ఫ్రాన్సిస్ క్రైస్తవులకు ఆధ్యాత్మిక స్ఫూర్తిగా నిలిచారని ఆర్‌సీఎం చర్చి రెవరెండ్ ఫాదర్ కడాలి మాణిక్యం అన్నారు. కోరుకొండ ఎస్ఆర్ నగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో బుధవారం పునీత ఫ్రాన్సిస్ ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఫాదర్ మాణిక్యం మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలను మానవాళికి ఉపదేశించిన మహనీయుడు ఫ్రాన్సిస్ అని కొనియాడారు. ప్రతి క్రైస్తవుడూ ఫ్రాన్సిస్ ఆరాధన బాటలో నడుచుకోవాలన్నారు. దీనికి ముందు మేరీమాత ఆరాధన కార్యక్రమంలో భాగంగా జపమాల నిర్వహించారు. ఉపదేశి బెల్లపు బేవిడ్, బెల్లపు మేరీవిజయ పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాలు తొలగించాలని ధర్నా

గోకవరం: ప్రధాన రహదారికి అడ్డంగా వేస్తున్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని కోరుతూ బీజేపీ, జనసేన పార్టీల నాయకులు బుధవారం గోకవరంలో ధర్నా నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి గుడి సెంటర్లో రోడ్డుపై బైఠాయించి సుమారు గంట పాటు నిరసన తెలిపారు. ప్రస్తుతం ప్రధాన రహదారి ఇరుకుగా ఉందని, రహదారిని విస్తరించకపోగా ఒకవైపు అడ్డంగా విద్యుత్ స్తంభాలను వేయడం వలన ప్రమాదం పొంచి ఉందన్నారు. దీనిపై పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని నిరసనకారులతో మాట్లాడటంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు మట్టా మంగరాజు, మండలాధ్యక్షుడు సత్తి వెంకటరెడ్డి, కార్యదర్శి ఇనకోటి బాపన్నదొర, బత్తుల వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కులపై అవగాహన

గోకవరం: బాలల హక్కులపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని తూర్పుగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. మండలంలోని వీరంకపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు బాలల హక్కులపై, పలు చట్టాలపై అవగాహన కల్పించారు. భోజనశాల, మరుగుదొడ్లు, డార్మెట్రీని పరిశీలించి విద్యార్థినులకు అందుతున్న వసతులు, సదుపాయాలపై ఆరా తీశారు. విద్యార్థినులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, వారికి నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## నన్నయలో స్వచ్ఛతా ఫ్రీడమ్ వాక్

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం స్వచ్ఛతా ఫ్రీడమ్ వాక్ నిర్వహించారు. ఫిట్ ఇండియా ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ యువతను ఉత్సాహ పరుస్తున్నారని, ఆ స్ఫూర్తితో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించామని వీసీ ఆచార్య పద్మరాజు తెలిపారు. ఈ నెలాఖరు వరకూ యూనివర్సిటీతో పాటు అనుబంధ కళాశాలల్లో ఈ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. మన ఆరోగ్యానికి వ్యాయామం ఎంతో అవసరమని, అయితే నేటి కాలంలో అది కూడా చాలామంది చేయలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



నన్నయ వర్సిటీ ప్రాంగణంలో నిర్వహించిన వాక్



## రైతు నేస్తం రుణాల పంపిణీ

రాజానగరం: రైతు నేస్తం పథకంలో దివాన్ చెరువు సొసైటీ ద్వారా బుధవారం తొమ్మిది మంది రైతులకు వ్యవసాయ రుణాలను పంపిణీ చేశారు. రూ. 96.32 లక్షల రుణాలకు సంబంధించిన చెక్కులను చైర్ పర్సన్ గంగిశెట్టి సోమేశ్వర్రావు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమంగా నిల్వ చేసిన బాణసంచా స్వాధీనం

పెదపూడి: మండలంలోని దోమాడలో అక్రమంగా నిల్వ చేసిన బాణసంచాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.వాసు బుధవారం తెలిపారు. పెదపూడి గ్రామానికి చెందిన పి.మణికార్జున్, కరకుదురు గ్రామానికి చెందిన ఎ.గోవిందు కలిసి దోమాడ గ్రామంలో ఉన్న షెడ్డులో నిల్వచేసిన సుమారు రూ.50 వేల విలువైన బాణసంచాను దాడి చేసి స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- బిక్కవోలులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం


బిక్కవోలులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల అభ్యున్నతే లక్ష్యంగా పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని బిక్కవోలులో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయనివిధంగా ప్రతిఒక్కరికీ సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో ఇంటి స్థలం మంజూరు చేసి ఇళ్లను నిర్మించిన ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, విదేశీ విద్యాదీవెన వంటి పథకాలతో పేదల విద్యకు బాసటగా నిలిచిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగించాలంటే మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ జంగావీర వెంకట సుబ్బారెడ్డి, జిల్లా మహిళ సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, సర్పంచ్ సరేళ్ల సుమలత, ఉపసర్పంచ్ డాక్టర్ జంగా మురళీకృష్ణా రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, గువ్వల సత్తిరెడ్డి, యామసాని రవి, పంచాయతీ కార్యదర్శి కర్రి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంపరలో రాట ముహూర్తం


సంపరలో రాట ముహూర్తం చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పెదపూడి: శరన్నవరాత్రుల ఉత్సవాలకు సంబంధించి సంపర శ్రీవిజయ దుర్గాదేవి ఆలయం వద్ద ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో పందిరి రాట ముహూర్తం బుధవారం చేశారు. ఈ సందర్భంగా హనుమంతాచార్యులు మాట్లాడుతూ నవరాత్ర ఉత్సవాలు ఈ నెల 15 నుంచి 23 వరకూ జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఆచంట సాంబ, మట్టా వీరబాబు, అంగర దొరబాబు, కొండేపూడి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని కాపవరంలో శ్రీదేవీ నవరాత్రులకు సంబంధించి ఆలయం వద్ద సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ చేతుల మీదుగా బుధవారం రాట ముహూర్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు సత్యంశెట్టి శ్రీను, కొట్టు వరలక్ష్మి, సత్యంశెట్టి వీర్రాఘవులు, ఎలుగుబంటి అన్నవరం, పిండి నాని తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత


బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 వేల నగదు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రంగంపేట: మండల పరిధిలోని మర్రిపూడి గ్రామానికి చెందిన నూకతట్టు శేఖర్ బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. అతడికి రూ.లక్ష వైఎస్సార్ బీమా మంజూరైంది. శేఖర్ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేలను వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, గ్రామ కన్వీనర్ వేము చిరంజీవి అందజేశారు. మిగిలిన రూ.90 వేలు నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమవుతాయని చెప్పారు.







## నేడు ఎమ్మెల్యే రాజా పుట్టినరోజు వేడుకలు

మధురపూడి: ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పుట్టినరోజు వేడుకలను గురువారం కోరుకొండ మండలం బూరుగుపూడిలో ఘనంగా నిర్వహించనున్నారు. పార్టీ నాయకుడు, వ్యవసాయ సలహా మండలి జిల్లా నాయకుడు కంటే వినయ్ తేజ వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నారు. 150 మంది ఉపాధి హామీ కూలీలకు ప్రమాద బీమా చెల్లించనున్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థిని భార్గవిని అభినందిస్తున్న పాఠశాల హెచ్ఎం వీరప్రభాకర్‌రావు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బూడి ప్రసన్న భార్గవి బాల్ బ్యాడ్మింటన్ సబ్ జూనియర్ విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని పాఠశాల హెచ్ఎం వీరప్రభాకర్‌రావు బుధవారం తెలిపారు. కర్నూలు జిల్లా మహానందిలో ఈ నెల 2 వరకూ జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న భార్గవి ఉత్తమ ప్రతిభను కనబరిచి స్టార్ ఆఫ్ ఆంధ్ర అవార్డును కైవసం చేసుకుందన్నారు. అక్టోబర్ 15 నుంచి 19 వరకూ చత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాయిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో మన రాష్ట్రానికి ప్రాతినిథ్యం వహిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా భార్గవిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

## 4,720 కిలోల రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన రేషన్ బియ్యం

రాజానగరం: జాతీయ రహదారిపై దివాన్ చెరువు వద్ద విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం 4,720 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. పక్కా సమాచారంతో రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వ్యాన్‌లో 100 ప్లాస్టిక్ బస్తాల్లో నింపిన 4,720 కిలోల పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకుని, బియ్యం, వాహనాన్ని సీజ్ చేశారు. పెద్దాపురం మండలం చంద్రమంపల్లికు చెందిన మామిడాల కోటేశ్వరరావు సూచనల మేరకు పిఠాపురం మండలం విరవకు చెందిన వ్యాన్ డ్రైవర్ అయ్యినతీరందాసు తమ్మారావు కాకినాడ నుంచి ఎన్టీఆర్ జిల్లాలోని తిరువూరుకు ఈ బియ్యాన్ని సరఫరా చేస్తున్నాడు. కిర్లంపూడి మండలానికి చెందిన టి. దుర్గాప్రసాద్ వ్యాన్‌లో రవాణా చేస్తున్నాడు. పట్టుబడిన బియ్యం, వాహనం విలువ రూ. 10,88,800 విలువ ఉంటుందని అంచనా. వాహనం యజమాని, డ్రైవర్, రవాణాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు రాజానగరం పోలీసులకు సిఫారసు చేశామని ప్రాంతీయ విజిలెన్స్ ఇన్‌చార్జి అధికారి ఎస్పీకే కుమార్ తెలిపారు. తనిఖీలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, జియాలజిస్టు లక్ష్మీనారాయణ, కానిస్టేబుళ్లు వలీ, కిషోర్ పాల్గొన్నారు.

## నేడు బిక్కవోలులో గడప గడపకూ..

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి బుధవారం తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

## కరకుదురులో గ్రామసభ

పెదపూడి: మండలంలోని కరకుదురు గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ వుండ్రు చంద్రకళ అధ్యక్షతన బుధవారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన పనులు, అవసరమైన మౌలిక సదుపాయల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, బి.ప్రసన్నకుమార్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీదేవి, ఫీల్డ్ అసిస్టెంట్ తోటకూర లోవరాజు తదితరులు పాల్గొన్నారు.



















